సాక్షి అనకాపల్లి

శనివారం । 9 । ఆగస్టు । 2025



● ఆరంభం అదుర్స్

విశాఖలోని డా.వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ మైదానంలో ఏపీఎల్ 4వ సీజన్ అట్టహాసంగా శుక్రవారం ప్రారంభమైంది. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, భారత మహిళా జట్టు మాజీ కెప్టెన్ మిథాలీరాజ్, సీజన్ బ్రాండ్ అంబాసిడర్ విక్టరీ వెంకటేష్ ట్రోఫీని ఆవిష్కరించగా, సినీ నటి ప్రజ్ఞాజైస్వాల్ షో ఉర్రూతలూగించింది. - విశాఖ స్పోర్ట్స్

● నిత్యానందకరీ.. శుభకరీ !



అనకాపల్లి: గవరపాలెం నూకాంబిక అమ్మవారికి కరెన్సీ నోట్లతో అలంకరణ



అనకాపల్లి టౌన్: భోగలింగేశ్వర స్వామి ఆలయంలో సర్వకామదాంబ అమ్మవారు



అనకాపల్లి: సత్యనారాయణపురం కనకదుర్గమ్మవారి కొండపై సామూహిక కుంకుమ పూజలు

శుభాలు చేకూర్చే శ్రావణలక్ష్మి ప్రతి ఇంటా కొలువుదీరింది. కోరికలు నెరవేర్చే వరలక్ష్మిగా అవతరించింది. అమ్మను అర్చించి భక్తకోటి తరించింది. శుక్రవారం మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. అమ్మవారి రూపును అందంగా తీర్చిదిద్ది మురిసిపోయారు. భక్తిపారవశ్యంతో మైమరచిపోయారు. అనకాపల్లిలోని సతకంపట్టు కనకదుర్గమ్మ, కన్యకాపరమేశ్వరి అమ్మవారు, సత్యనారాయణపురం కనకదుర్గమ్మ, గవరపాలెం సంతోషిమాత ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. అనకాపల్లిలో గవరపాలెం నూకాంబిక అమ్మవారిని రూ.7 లక్షల కరెన్సీనోట్లతో అలంకరించారు.

-అనకాపల్లి

చినబాబుకు రూ.12 కోట్ల చదివింపులు



- ఇప్పటికే చెల్లించిన రియల్టర్లు
- డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ పేరుతో రంగ ప్రవేశం
- ఎండాడలో ఇప్పటికే పలు ప్రాజెక్టులు చేపట్టిన ఓ సంస్థ
- దసపల్లా భూముల వ్యవహారంలోని మరో రియల్టర్‌కు అప్పగింత
- విచారణ చేయాలని అన్ని పక్షాల నుంచి డిమాండ్
- కమిటీ కష్టమంటూ కలెక్టర్ నివేదికతోనే స్పీకర్‌ను బుజ్జగించే యత్నం?

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

నిషేధిత జాబితా నుంచి తొలగించిన ఎండాడలోని 5.10 ఎకరాల భూ వ్యవహారంలో చినబాబుకు ఇప్పటికే రూ.12 కోట్ల చదివింపులు పూర్తయినట్టు తెలుస్తోంది. ఈ చెల్లింపుల వ్యవహారాన్ని మొత్తం దక్షిణ నియోజకవర్గానికి చెందిన ఓ టీడీపీ నేత చూసినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ చెల్లింపులు పూర్తయిన తర్వాత ఎండాడలోని సర్వే నంబరు 14-1 లోని 5.10 ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించినట్టు సమాచారం. ఈ భూమిని అభివృద్ధి చేసేందుకు ఇద్దరు రియల్ ఎస్టేట్ సంస్థలు రంగప్రవేశం చేశాయి. ఇప్పటికే ఎండాడలో పలు ప్రాజెక్టులు చేపట్టిన సంస్థ ఒకటి కాగా.. చినబాబు సామాజికవర్గానికే చెంది, దసపల్లా భూముల వ్యవహారాల్లో ఉన్న మరో సంస్థ రంగంలోకి దిగినట్టు తెలుస్తోంది. ఈ స్థలంలో 14 ఫ్లోర్ల వరకూ నిర్మించే అవకాశం ఉందని.. తక్కువలో తక్కువగా చదరపు అడుగుకు ప్రారంభంలోనే రూ.6 వేల వరకూ ధర పలికే అవకాశం ఉందని సదరు రియల్టర్లు లెక్కలు వేసినట్టు కూడా తెలుస్తోంది. వాస్తవానికి ఇప్పటికే హైదరాబాద్‌కు చెందిన ఒక సంస్థ పేరు మీద కొంత భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయింది. ఆ సంస్థ నుంచి విశాఖకు చెందిన ఈ ఇద్దరు రియల్టర్ల చేతికి రానుందని సమాచారం. ఈ మేరకు ఇప్పటికే అనధికారికంగా ఒప్పందం జరిగినట్టు కూడా తెలుస్తోంది. మరోవైపు ఈ భూమి వ్యవహారంలో విచారణ చేయాలంటూ ప్రతిపక్షంతో పాటు స్వపక్షం నుంచి కూడా స్పష్టమైన డిమాండ్లు వస్తున్నాయి. కమిటీ వేసి విచారణ చేయాలంటూ స్వయంగా స్పీకర్ కోరినప్పటికీ కుదరదని కలెక్టర్ నివేదికతోనే సరిపుచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్టు తెలుస్తోంది. మొత్తంగా నేరుగా చినబాబు పాత్ర ఉండటంతో విచారణ జరిపేందుకు ప్రభుత్వం వెనకాడుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మరిన్ని భూములపై నిషేధం ఎత్తివేత..!

వాస్తవానికి ఎండాడలోని 14-1 సర్వే నంబరుకు చెందిన 5.10 ఎకరాల భూమికి చెందిన రికార్డుల్లో రెవెన్యూ అధికారులనూ తికమక పెట్టే వ్యవహారాలు నడిచాయనే విమర్శలున్నాయి. ఫలానా పేరు మీద ఈ భూమి ఉందని...అయినప్పటికీ ఇది ప్రభుత్వ భూమి కావున రిజిస్ట్రేషన్ చేయవద్దంటూ స్వయంగా గతంలో కలెక్టర్ రిజిస్ట్రేషన్ల శాఖను ఆదేశించారు. తీరా నిషేధిత జాబితా నుంచి తొలగించే సమయానికి ప్రైవేటుపరం చేస్తూ నిర్ణయాలు వెలువడ్డాయి. వాస్తవానికి 14-1 సర్వే నంబరులోని భూమి చెట్టిపల్లి సీతారామయ్య పేరు మీద నమోదై ఉంది. అయితే తాజాగా కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల్లో మాత్రం ఈ భూమి మాజీ సైనిక అధికారికి చెందినదని, చెట్టిపల్లి సీతారామయ్య పేరు కేవలం ఫారం-3లో మాత్రమే ఉందని పేర్కొన్నారు. అయితే ఇందుకు భిన్నంగా అసలు వ్యక్తి సాగులోనే లేరంటూ వై.బాలిరెడ్డికి చెందినదంటూ ఆయన పేరు మీద బదలాయించాలంటూ ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో పై నుంచి ఆదేశాలు వచ్చేందుకు కీలకంగా వ్యవహరించిన విశాఖ దక్షిణ నియోజకవర్గానికి చెందిన నేత ప్రధానంగా చక్రం తిప్పినట్టు సమాచారం. చినబాబు అండతో రెచ్చిపోయారనే విమర్శలున్నాయి. ఎన్నికలకు ముందు చినబాబుకు నేరుగా తమ సామాజిక వర్గానికి చెందిన నేతల ద్వారా హైదరాబాద్‌లో భారీగా ఎలక్షన్ ఫండ్ సమకూర్చడంతో ఈ నేతకు సదరు చిన్నబాబు వద్ద పలుకుబడి ఉన్నట్టు పార్టీలో చర్చ జరుగుతోంది. స్థానిక నేతలు, ఎమ్మెల్యేలతో ఏ మాత్రం సంబంధం లేకుండా వ్యవహారాలు నడుపుతుండటంతో సదరు దక్షిణ నియోజకవర్గ నేతపై ఆ పార్టీలోని ఇతర నేతలందరూ రుసరుసలాడుతున్నట్టు తెలుస్తోంది. అయినప్పటికీ ఇంకా ఏమైనా ఫైల్స్ ఉంటే తన వద్దకు తీసుకురావాలంటూ సదరు దక్షిణ నియోజకవర్గ నేత కోరుతున్నట్టు తెలుస్తోంది. అంటే త్వరలో మరిన్ని ప్రభుత్వ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించనున్నారన్నమాట.

కమిటీ కష్టం... కలెక్టర్ నివేదికతోనే సరి...!

వాస్తవానికి ఎండాడ భూమి వ్యవహారంలో సొంత పార్టీ నేతల నుంచే విచారణ జరపాలనే డిమాండ్ వస్తోంది. ఇప్పటికే ఈ భూమి వ్యవహారంపై విచారణ జరిపించాలంటూ స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కలెక్టర్‌కు లేఖ రాశారు. న్యాయవిచారణ జరగాల్సిన అవసరం ఉందని కూడా అభిప్రాయపడ్డారు. మరోవైపు నివేదిక సమర్పించాలంటూ రెవెన్యూ మంత్రికి స్పీకర్ లేఖ ద్వారా ఆదేశించారు. ఇక మండలిలోని ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ సైతం ఈ వ్యవహారంలో లోతుగా విచారణ జరిపి వాస్తవాలు బయట పెట్టాలంటూ నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. మాజీ సైనికులకు చెందిన భూముల విషయంలో సీనియర్ అధికారులు, రాజకీయ నేతల ప్రమేయం ఉండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ల్యాండ్ గ్రాబింగ్ వ్యవహారాల్లో అటు అధికారులు, ఇటు రాజకీయ నేతల మధ్య ఏర్పడుతున్న అనైతిక సంబంధాలు ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తాయన్న ఆందోళనను ఆయన వ్యక్తం చేశారు. జనసేన కార్పొరేటర్ సైతం విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఇలా అన్ని పార్టీల నేతలు ఎండాడ భూమి విషయంలో అటు అధికారులు, ఇటు రాజకీయ నేతల ప్రమేయం ఉందన్న అభిప్రాయాన్ని బలంగానే వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి మాత్రం నామమాత్ర స్పందన రాకపోవడం గమనార్హం. అంతేకాకుండా కమిటీ వేయాలని రెవెన్యూ మంత్రికి రాసిన లేఖలో స్పీకర్ కోరగా.. కమిటీ వేయాలంటే ముఖ్యమంత్రి అనుమతి కావాలని తేల్చిచెప్పినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే కేవలం కలెక్టర్ ఇచ్చిన నివేదికనే స్పీకర్‌కు.. రెవెన్యూ మంత్రి ఇవ్వనున్నట్టు అధికార వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. స్వయంగా సొంత పార్టీకే చెందిన స్పీకర్ కోరినప్పటికీ ప్రభుత్వం పెద్దగా సీరియస్‌గా తీసుకోలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో ఈ వ్యవహారంలో చినబాబు పాత్ర ఉండటం వల్లే ప్రభుత్వం నుంచి స్పందన లేదన్న అభిప్రాయం అందరిలోనూ బలపడుతోంది.

'మయామీ ఆఫ్ ది ఈస్ట్'గా విశాఖ

- థీమ్ నగరాల అభివృద్ధికి వీఎంఆర్‌డీఏ ప్రణాళికలు
- భీమిలి, శొంఠ్యాంతో పాటు మరో రెండు చోట్ల ప్రదేశాల గుర్తింపు
- పీపీపీ విధానంలో అభివృద్ధికి సన్నాహాలు



విశాఖ సిటీ: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో వినూత్న ప్రాజెక్టుల రూపకల్పనకు విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నీతి ఆయోగ్ సిఫార్సుల మేరకు విశాఖను 'బే సిటీ'గా 'మయామీ ఆఫ్ ది ఈస్ట్'గా అభివృద్ధి చేసేందుకు అడుగులు వేస్తోంది. ఇందుకోసం థీమ్ నగరాల అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతోంది. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చి ఆర్థిక ప్రోత్సాహం అందించే దిశగా ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తోంది. ఇందులో భాగంగా విశాఖలో ప్రత్యేకంగా థీమ్ బేస్డ్ టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే రెండు ప్రాంతాలను గుర్తించగా.. మరో ప్రదేశాల గుర్తింపు తుది దశలో ఉంది. పబ్లిక్, ప్రైవేట్, పార్ట్నర్‌షిప్(పీపీపీ) విధానంలో ఈ ప్రాజెక్టులను చేపట్టాలన్న ఆలోచనలో ఉంది.

నీతి ఆయోగ్ సిఫార్సులతో

విశాఖ ప్రపంచ స్థాయి నగరంగా ఎదిగేందుకు అవసరమైన అన్ని వనరులు పుష్కలంగా ఉన్నాయి. ప్రధానంగా తీర ప్రాంతం అదనపు ఆకర్షణగా నీతి ఆయోగ్ గుర్తించింది. దీంతో విశాఖను ఫ్లోరిడాలోని మయామీ నగరాన్ని ఆదర్శంగా తీసుకుని అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సిఫార్సులు చేసింది. దీని ప్రకారం వీఎంఆర్‌డీఏ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రతి పట్టణ క్లస్టర్‌ను ఒక ప్రత్యేక థీమ్ ఆధారంగా అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు. ఐటీ-ఇన్నోవేషన్, హెల్త్-వెల్‌నెస్, నాలెడ్జ్-ఎడ్యుకేషన్, టూరిజం-కల్చర్, లాజిస్టిక్స్-ట్రేడ్, వంటి రంగాలు ఆధారంగా వీటిని అభివృద్ధి చేయాలన్న ఆలోచనలో ఉన్నారు. విశాఖలో మూడు థీమ్ బేస్డ్ టౌన్‌షిప్‌ల నిర్మాణంపై వీఎంఆర్‌డీఏ అధికారులు దృష్టి పెట్టారు. ఇందుకోసం ప్రాంతాలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే భీమిలి మండలం కొత్తవలస, ఆనందపురం మండలం శొంఠ్యం గ్రామాలను గుర్తించారు.

శ్రీకృష్ణాపురం గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

ఆరిలోవ: శ్రీకృష్ణాపురం సాంఘిక సంక్షేమ గురుకులంలో మిగులు సీట్లు ఎస్సీ విద్యార్థుల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఇక్కడ ఐదో తరగతి 37, ఆరో తరగతి 6, ఏడో తరగతి 2, టెన్త్ 9, ఇంటర్ ఐఐటీ అండ్ నీట్ 38 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ఆమె తెలిపారు. ఆయా తరగతుల్లో చేరడానికి ఆసక్తిగల ఎస్సీ విద్యార్థులు ఆధార్ కార్డు, తల్లిదండ్రులు ఆధార్ కార్డులు, తల్లి బ్యాంక్ పాస్ బుక్ ఫ్రెంట్ పేజీ జెరాక్స్, కులధ్రువీకరణ పత్రం రేషన్ కార్డు నంబర్, ఇంటర్‌లో చేరదలచినవారు పదో తరగతి మార్క్ షీట్‌తో గురుకులానికి చేరుకోవాలని సూచించారు.

6.5 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

- ఏటికొప్పాక రైల్వేగేటు వద్ద లారీ స్వాధీనం



బస్తాల్లో పాలిష్ చేసిన రేషన్ బియ్యం



రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ

యలమంచిలి రూరల్: అక్రమంగా లారీలో తరలిస్తున్న సుమారు 6.5 టన్నుల రేషన్ బియ్యాన్ని యలమంచిలి రెవెన్యూ అధికారులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని స్వాధీనపర్చుకున్నారు. వివరాలివి.. యలమంచిలి మండలం పులపర్తి గ్రామంలో వెంకటదుర్గా రైసు మిల్లులో ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన రేషన్ బియ్యం బస్తాల్లో ప్యాక్ చేసి ఏపీ 16 టీవై 4491 రిజిస్ట్రేషన్ నెంబరు గల లారీలో లోడు చేస్తుండగా రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. దీనిని పట్టుకోవడానికి రెవెన్యూ అధికారులు పులపర్తి వెళ్లేసరికి అక్రమార్కులు లారీని అక్కడ్నుంచి ఏటికొప్పాక జగనన్న కాలనీకి తరలించారు. గ్రామస్థులకు అనుమానం వచ్చి కొందరు మీడియా ప్రతినిధులకు సమాచారం ఇచ్చారు. అనంతరం రెవెన్యూ, పోలీసు అధికారులకు కూడా సమాచారం చేరవేశారు. తహసీల్దార్ వరహాలు ఆదేశాలతో డీటీ వినయ్‌కుమార్, ముగ్గురు వీఆర్వోలు ఏటికొప్పాకకు చేరుకునేసరికి రేషన్ బియ్యంతో ఉన్న లారీని అక్కడ్నుంచి తరలించుకుపోతుండగా ఏటికొప్పాక రైల్వేగేటు వద్ద రెవెన్యూ అధికారులు వాహనాన్ని ఆపి స్వాధీనపర్చుకున్నారు. లారీలో 50 కేజీల బియ్యం ఉన్న 130 బస్తాలు ఉన్నట్టు డిప్యూటీ తహసీల్దార్ వినయ్‌కుమార్ తెలిపారు. నిబంధనల ప్రకారం దీనిపై 6 ఏ కేసు నమోదు చేయనున్నట్టు ఆయన తెలిపారు.

అంతలో ఎంత మార్పు!

- నామమాత్రపు సెక్షన్లతో సరిపెట్టిన పోలీసులు
- సామాజిక కార్యకర్తపై హత్యాయత్నం జరిగినా సంబంధిత సెక్షన్ నమోదు చేయని వైనం

సాక్షి, అనకాపల్లి: తీవ్ర గాయాలతో పడి ఉన్న సామాజిక కార్యకర్తను చూసి చలించిన తొలుత పోలీసులు సరిగానే స్పందించారు. స్వయంగా పోలీసు అధికారి వచ్చి బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. అంతలోనే ఏమైందో గానీ ఒకరోజు గడిచేసరికి వారిలో మార్పు వచ్చింది. నామమాత్రపు సెక్షన్లతో సరిపెట్టారు. గో రక్షణ పేరుతో వాటిని మాంస వ్యాపారులకు తరలిస్తున్న టీడీపీకి చెందిన వ్యక్తుల గుట్టు రట్టు చేసిన ఎస్.రాయవరానికి చెందిన సామాజిక కార్యకర్త నూకరాజుపై గురువారం హత్యాయత్నం జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై బీఎన్ఎస్ చట్టం 118 (1), 329(4) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇంట్లో అక్రమంగా ప్రవేశించడం, ఆయుధంతో గాయపరచడం వంటి అభియోగాలు పెట్టారు. హత్యాయత్నం అని స్పష్టంగా తెలుస్తున్నా ఆ సెక్షన్ జోలికి పోలేదు. ప్రధాన నిందితుడు గొర్ల దేముళ్లు హోం మంత్రి వంగలపూడి అనితకు సన్నిహితుడు కావడంతోనే పోలీసులు ఒత్తిళ్లకు తలొగ్గినట్టు కనిపిస్తోంది. తనపై హత్యాయత్నానికి పాల్పడిన వారిపై నామమాత్రపు సెక్షన్లతోనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి పోలీసులు ముగ్గురు గూండాలను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని నూకరాజు ఆరోపించారు. తాను ముగ్గురిపై ఫిర్యాదు చేస్తే ఇద్దరిపై మాత్రమే కేసు నమోదు చేశారన్నారు. తన అడ్డు తొలగించుకోవాలనే నిందితులు ఇంటి సీసీ కెమెరాలు నిర్వీర్యం చేశారని, తాను ఒంటరిగా ఉన్న సమయంలో చంపాలని చూశారన్నారు. ఇవన్నీ చూస్తుంటే వారికి పోలీసుల మద్దతు ఉందన్న అనుమానం వస్తోందన్నారు. గోవుల అక్రమ రవాణా ముఠాకు వారు వత్తాసు పలుకుతున్నారేమోనన్న సందేహం వస్తోందన్నారు.

గ్యాప్ ఏరియా.. విముక్తి లేదయా..!

- కలగా మిగిలిపోతున్న గిరిజనుల ఆశలు
- కలెక్టర్లు కళ్లారా చూసినా తీరని కష్టాలు
- స్పీకర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందన శూన్యం
- గిరిజనుల సమస్యలపై నిర్లక్ష్య ధోరణిలో కూటమి ప్రభుత్వం





గిరిజనులు సాగు చేసుకుంటున్న గ్యాప్ ఏరియా భూములు (ఇన్‌సెట్) గతంలో ఇచ్చిన అటవీ హక్కు పత్రాలు

అసలే వెనుకబడ్డ గిరిజన ప్రాంతంలో ఈ అడవి బిడ్డల దుస్థితి మరింత జటిలమైన సమస్య.. కలెక్టర్లు వస్తున్నారు, వెళుతున్నారు, పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నారు.. స్పీకర్ అయ్యన్నపాత్రుడు వంటి నాయకులెందరికో గిరిజనులు తమ గోడు వినిపించారు.. గానీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. గ్యాప్ ఏరియా భూముల సమస్య అలాగే ఉంది.



కలెక్టర్ విజయ కృష్ణన్‌కు గిరిజన సమస్యలు వివరిస్తున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి (ఫైల్)



అసనగిరిలో పర్యటిస్తున్న పూర్వ కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి (ఫైల్)

నాతవరం:

సరుగుడు, సుందరకోట.. నాతవరం మండలంలోని అత్యంత క్లిష్టమైన గిరిజన పంచాయతీలు.. ఇవి 1/70 యాక్టు పరిధిలో ఉన్నాయి. ఈ రెండు పంచాయతీల పరిధిలో అసనగిరి, రామన్నపాలెం, ముంతమామిడిలొద్దు, తోరడ, దద్దుగుల, రాజవరం, మాసంపల్లి, అచ్చంపేట, యరకంపేట, శిరిపురం, బమ్మిడికలొద్దు, కొత్త దద్దుగుల, కొత్త లంకలు, పాత శిరిపురం శివారు గ్రామాలు ఉన్నాయి. ఆ గ్రామాల్లో గిరిజనులంతా గ్యాప్ ఏరియా భూముల్లో తుప్పలు, డొంకలను తొలగించి వ్యవసాయం సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. కొండల మీద ఉన్న భూములను బ్రిటిష్ హయాంలో సైతం సర్వే చేయకపోవడంతో సుమారు 10 వేల ఎకరాలను గ్యాప్ ఏరియా భూములుగా పరిగణిస్తున్నారు. అవి రెవెన్యూ రికార్డుల్లో నమోదు కాకపోవడంతో గిరిజనులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలేవీ వారికి అందడం లేదు. గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను సర్వే చేసి అటవీ హక్కు పత్రాలు ఇవ్వాలని ఏళ్ల తరబడి కలెక్టర్లకు విజ్ఞప్తి చేసుకుంటున్నా ఫలితం లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ కాలంలో కొందరికి పట్టాలు వచ్చాయి. మిగతా వారికి పంపిణీ చేసే లోగా కూటమి ప్రభుత్వం వచ్చి ఆ ప్రక్రియను నిలిపివేసింది. గిరిజనుల విజ్ఞప్తి మేరకు 2006 నుంచి అనేక మంది కలెక్టర్లు ఈ గిరిజన గ్రామాలను సందర్శించారు. ప్రస్తుత కలెక్టర్ విజయ కృష్ణన్, అంతకుముందు కలెక్టర్‌గా పనిచేసిన రవి పట్టాన్‌శెట్టి కూడా ఈ ప్రాంతానికి వచ్చారు. వారి ఆదేశాలతో గ్యాప్ ఏరియా భూములను సర్వే చేసేందుకు చర్యలు చేపట్టారు. రెండు జిల్లాల సరిహద్దులో గల గ్యాప్ ఏరియా భూములు ఎంతవరకు ఉన్నాయనేది హద్దులు నిర్ణయించారు. కానీ ఈ ప్రక్రియను పూర్తి చేసి గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను నిర్ధారించే విషయాన్ని మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారు.

అందని ఐటీడీఏ సదుపాయాలు

పాడేరు ఐటీడీఏ ద్వారా కల్పించే సదుపాయాలు మైదాన ప్రాంతంలో గిరిజనులకు అందడం లేదు. గతంలో పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల్లో గిరిజనులకు అందిస్తున్న రాయితీలు, సదుపాయాలను కల్పించేవారు. ఇటీవల కాలంలో కూటమి ప్రభుత్వం మైదాన ప్రాంత గిరిజనులకు ఎటువంటి సౌకర్యాలు కల్పించలేదు. గిరిజన ప్రాంతంలో అధికంగా సర్పంచులు, ఎంపీటీసీలు ఇతర ప్రజా ప్రతినిధులు వైఎస్సార్‌సీపీకి చెందిన వారు ఉండటంతో కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజనులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను పాడేరు ఐటీడీఏ ద్వారా కొనుగోలు చేసేవారు. ఇటీవల కాలంలో పూర్తిగా వదిలేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మైదాన ప్రాంత గిరిజనులను పట్టించుకోవడం మానేశారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే గిరిజనులకు మేలు

సరుగుడు, సుందరకోట పంచాయతీల్లో సాగు చేసుకుంటున్న గిరిజనులకు అటవీ హక్కు పత్రాలు అందజేసి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు భరోసా పథకంలో పెట్టుబడి సాయం అందించేది. ఈ రెండు పంచాయతీల్లో అర్హత ఉన్న 550 మందికి రైతు భరోసా పథకంలో డబ్బులు అందచేశారు. సర్వే చేసి ఇంకా 350 మందికి పైగా హక్కు పత్రాలు ఇవ్వడానికి సిద్ధం చేయగా ఈలోగా ఎన్నికల కోడ్ వచ్చి ప్రక్రియ నిలిచిపోయింది.

వాటిని నేటికీ ఇవ్వకపోవడంతో గత ఏడాది గ్రామంలో పర్యటనకు వచ్చిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకెళ్లారు. ఎలాంటి స్పందన కానరాలేదు.

గిరిజనులకు తీరని అన్యాయం



రాజ్యాంగం మాకు కల్పించిన హక్కులను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పాడేరు ఐటీడీఏ ద్వారా గిరిజనులకు ఇచ్చే సంక్షేమ పథకాలు, రాయితీలు మైదాన ప్రాంతంలో ఉండే మాకు కూడా వర్తింపజేసేవారు. మాకు ఇప్పుడు ఎలాంటి సాయం అందడం లేదు.

-బండి గంగరాజు, గిరిమిత్ర స్వచ్ఛంద సేవా సంస్థ, సరుగుడు

ఇంకెవ్వరికి బాధలు చెప్పుకోవాలి



మా గిరిజన గ్రామాల్లో ప్రధాన సమస్యలను స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కలెక్టర్ విజయ కృష్ణన్‌లకు తెలియజేశాం. గత ప్రభుత్వంలో మధ్యలో నిలిచిపోయిన అటవీ హక్కు పత్రాల పంపిణీని పూర్తి చేయమని స్పీకర్‌ను కోరాం. అయినా ఇంతవరకు గ్యాప్ ఏరియా సమస్య పరిష్కారం కాలేదు.

- సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీపీ, సరుగుడు

మహిళల ఉన్నతికి..

గిరిజనులకు నూరుశాతం పనులతోపాటు ఉద్యోగాలు, పదవుల్లోను రిజర్వేషన్ కల్పిస్తూ గత ప్రభుత్వంవలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంచలనమైన నిర్ణయం తీసుకోవడంతో పాటు చట్టాన్ని తీసుకువచ్చారు. దీని వల్ల 50 శాతం మహిళలకు పలు పదవుల్లో అవకాశాలు లభించాయి.

ప్రత్యేక జిల్లాతో పాలన చేరువ..

పాడేరు కేంద్రంగా స్వాతంత్ర్య పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు పేరిట గిరిజనులకు ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేసి చరిత్రలో నిలిచిపోయారు. జిల్లాలోని 22 మండలాల్లో 83 శాతం గిరిజనులే ఉన్నారు. ప్రత్యేక జిల్లా ఏర్పాటుతో పాలన పూర్తిస్థాయిలో చేరువైంది.

గిరిజనుల గుండెల్లో జగన్..

2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం జారీ చేసిన బాక్సైట్ జీవో 97కు వ్యతిరేకంగా ప్రతిపక్ష నేత హోదాలో పోరాడిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి హోదాలో బాక్సైట్ జీవో 97ను రద్దు చేసి గిరిజనుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.



అత్యంత మారుమూల కొండ్రుం గ్రామానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన రోడ్డు

నాడు ప్రగతి.. నేడు అధోగతి

ఆదివాసీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

గిరిజనాభివృద్ధిని విస్మరించిన కూటమి ప్రభుత్వం

మన్యంలో విలక్షణ జీవనశైలి ఆదివాసీలది. వీరి అభ్యున్నతికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిచ్చింది. అల్లూరి సీతారామరాజు పేరిట ప్రత్యేక జిల్లా ఏర్పాటుచేసి అభివృద్ధి, పాలన చేరువ చేసింది. ఆధునికత దిశగా అడుగులు వేసేలా తీర్చిదిద్దితే.. ఆ తరువాత అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. పాలన చేపట్టి సుమారు ఏడాదిన్నరకు చేరువ అవుతున్నా వీరి సంక్షేమానికి తీసుకున్న చర్యలు కానరావడం లేదు. నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా..

సాక్షి,పాడేరు: తెల్లవారితే కొండపోడు వ్యవసాయం. అటవీ ఫలసాయం,ఉత్పత్తుల సేకరణతోనే ఆదివాసీల జీవన విధానం ప్రారంభమవుతుంది.అడవులలో అష్టకష్టాలు పడి సేకరించే అటవీ ఉత్పత్తులను వారపుసంతలకు తీసుకువచ్చి వాటిని విక్రయించి తద్వారా వచ్చే ఆదాయంతో వారానికి కుటుంబ పోషణకు సరిపడా నిత్యావసర సరుకులు కొనుగోలు చేసుకుని గ్రామాలకు తీసుకువెళ్తుంటారు.గిరిజనుల జీవన విధానమంతా అనేక కష్టాలతో కూడుకున్నదే. ఇలా సాగుతున్న జీవన విధానంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది.

- గిరిశిఖర గ్రామాల్లో నివసిస్తున్న ఆదివాసీలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందకపోవడంతో ఆజాతి గిరిజనుల సంక్షేమానికి గత ఐదేళ్లలో అధిక ప్రాధాన్యం ఇచ్చి మౌళిక వసతులు కల్పించారు.
- గిరిజనుల సంక్షేమానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 352 సచివాలయాలను ఏర్పాటు చేసి, పరిపాలనను చేరువ చేసింది. విద్య, వైద్యం, రోడ్లు, కమ్యూనికేషన్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది.
- అటవీ హక్కుల చట్టంలో భూమి పట్టాలు పొందిన సన్న, చిన్నకారు రైతులకు, మైదాన ప్రాంత రైతులతో సమానంగా హక్కులతో పాటు ప్రభుత్వ పథకాలు పొందేలా చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని అటవీ భూములు సాగు చేస్తున్న 1,40,407మంది గిరిజనులకు 1.50లక్షల ఎకరాలను అటవీ భూములను పలు విడతలుగా పంపిణీ చేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సర్వహక్కులు కల్పించింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ఒక్క పట్టాకూడా ఇవ్వలేదు. అర్హులంతా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.



పాడేరులో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన వైద్య కళాశాల

నత్తనడకన పనులు : జిల్లా కేంద్రమైన పాడేరులో రూ.500కోట్లతో వైద్య కళాశాలను ఏర్పాటు చేసి వైద్యవిద్యను అందుబాటులోకి తెచ్చింది. జిల్లా సర్వజన ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి రావడంతో రిఫరల్ కేసుల సంఖ్య తగ్గింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ప్రత్యేకంగా తీసుకున్న చర్యలు లేవు. వైద్యాధికారుల పోస్టుల భర్తీపై దృష్టి పెట్టలేదు. వైద్యకళాశాలకు అనుబంధంగా ఏర్పాటుచేస్తున్న 500 పడకల ఆస్పత్రి పనులు నత్తనడకను తలపిస్తున్నాయి.

- రంపచోడవరంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం చేపట్టగా, దీనిపట్ల ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది.నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. సుమారు 146 పడకలతో నిర్మించే ఈ ఆస్పత్రికి రూ. 49.26 కోట్లు గత ప్రభుత్వం వెచ్చించింది. 2022 ఫిబ్రవరిలో
- నాడు–నేడు పథకంలో జిల్లాలోని 47 ఆరోగ్య కేంద్రాలను రూ.22.69 కోట్లతో అభివృద్ధి చేసింది. ఆస్పత్రుల్లో పూర్తిస్థాయి వైద్య సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చింది. 12 పీహెచ్‌సీలకు రూ.18.74 కోట్లతో కొత్త భవనాలను నిర్మించింది.
- జిల్లా వ్యాప్తంగా నాడు–నేడు మొదట విడతలో రూ.165.27 కోట్లతో 581 పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసింది. రెండవ విడతలో 967 పాఠశాలల అభివృద్ధికి రూ.108.96 కోట్లను వెచ్చించి అభివృద్ధికి బాటలు వేసింది.



చెరుకుంపాలెంలో కాఫీతోటకు పొందిన అటవీ హక్కు పత్రంతో కొర్రా కృష్ణ

- జిల్లాలోని 1.68 లక్షల మంది గిరిజన రైతులకు ఏటా రూ.127 కోట్ల రైతు భరోసా పథకంలో సాయం అందజేసింది. కూటమి ప్రభుత్వంలో అర్హత ఉన్నప్పటికీ వీరిలో సుమారు 25 వేల మందికి అన్నదాత సుఖీభవ సాయం కోత విధించింది.
- అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా ఇంటింటికి తాగునీరు అందించే లక్ష్యంగా రూ.629.72కోట్లతో పనులు చేపట్టింది
- జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గిరిజనులకు 5జీ నెట్‌వర్క్ సేవలు అందించే లక్ష్యంగా రూ.400 కోట్లతో 2,061 సెల్ టవర్లను మంజూరు చేసింది. సుమారు 700 గ్రామాలకు నెట్‌వర్క్‌ను గత ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.
- రాజమహేంద్రవరం నుంచి జిల్లా మీదుగా విజయనగరం వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి మన్యానికి వరంలా మారింది.టూరిజం కారిడార్లో భాగంగా 251.12 కిలోమీటర్ల రోడ్డును రూ.2,109,14 కోట్లతో ఈ నిర్మాణం చేపట్టింది. ఐ.పోలవరం, గంగవరం, రాజవొమ్మంగి, అడ్డతీగల, కొయ్యూరు, కృష్ణదేవిపేట, పెదవలస, రంపుల ఘాట్, లంబసింగి, జి.మాడుగుల, పాడేరు, అరకు, అనంతగిరి మీదుగా నిర్మిస్తున్న జాతీయ రహదారి త్వరలో అందుబాటులోకి రానుంది.

ఏపీఎల్ ఆరంభం అదుర్స్



ఏపీఎల్ ప్రారంభ వేడుకల్లో పాల్గొన్న మహిళా క్రికెటర్ మిథాలీ రాజ్, సినీ నటుడు వెంకటేష్

- భరత్, రాహుల్ సెంచరీల మిస్
- వర్షం కారణంగా 14 ఓవర్లకు కుదింపు
- 13.2 ఓవర్లలో అమరావతి రాయల్స్ లక్ష్య ఛేదన

విశాఖ స్పోర్ట్స్: వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఫ్లడ్ లైట్ల వెలుగులో ఏపీఎల్ నాలుగో సీజన్ అట్టహాసంగా శుక్రవారం ప్రారంభమైంది. అయితే రెండో జట్టు బ్యాటింగ్‌కు దిగకముందే భారీ వర్షంతో మ్యాచ్ నిలిచింది. ఆరంభ మ్యాచ్‌లో కాకినాడ కింగ్స్‌పై టాస్ గెలిచి అమరావతి రాయల్స్ బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన కింగ్స్ ఐదు వికెట్లు కోల్పోయి 229 పరుగులు భారీ స్కోర్ చేసింది. కెప్టెన్ భరత్‌కు రాహుల్ తోడై స్కోర్‌ను పరుగులెత్తించారు. సెంచరీకి చేరువ(96, 5 ఫోర్లు, 9 సిక్సర్లు)లో రాహుల్ ఔటవగా, భరత్(93, 6 ఫోర్లు, 7 సిక్సర్లు) కూడా సెంచరీని చేజార్చుకున్నాడు. వర్షం కారణంగా మ్యాచ్‌ను 14 ఓవర్లలో 173 పరుగులు లక్ష్యంగా నిర్దేశించారు. అమరావతి రాయల్స్ బ్యాటర్లు రాణించడంతో 13.2 ఓవర్లలోనే 7 వికెట్ల నష్టానికి లక్ష్యాన్ని ఛేదించి, విజయకేతనం ఎగురవేశారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పేట విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో విజయ్‌ప్రకాష్

పాయకరావుపేట: నెల్లూరులోని అక్షర విద్యాలయంలో జరిగిన సీబీఎస్‌ఈ క్లస్టర్ – 7 అథ్లెటిక్స్ పోటీల్లో పాయకరావుపేట విద్యార్థులు సత్తా చాటారు. శ్రీప్రకాష్ విద్యార్థులు ఆదిత్యకుమార్, జయ సత్య, సునీల్ కుమార్, సత్య పవన్, దుర్గాప్రసాద్, ఎం.కేశవ్‌కుమార్ పలు విభాగాల్లో బంగారు, కాంస్య పతకాలు సాధించారు. వీరంతా వారణాసిలోని అతులానంద్ కాన్వెంట్ స్కూల్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, ప్రిన్సిపాల్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ అపర్ణ, కోచ్‌లు చిన్నా, శ్రీరామాంజనేయులు అభినందించారు.

వచ్చేనెల 13న జాతీయ లోక్ అదాలత్

విశాఖ–లీగల్: ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలోని అన్ని న్యాయస్థానాల్లో వచ్చేనెల 13న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవడానికి ఇది ఒక మంచి అవకాశమన్నారు. న్యాయ స్థానాల్లో ఉన్న పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాల కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ చట్టం కేసులు, బ్యాంకు, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక, కుటుంబ తగాదాలు (విడాకులు కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సేవా సదన్, విశాఖపట్నంలో లేదా 0891 – 2560414, 2575046 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు. అలాగే vskpdlsa@yahoo. com, dlsa. vsp@gmail. com మండల న్యాయ సేవా సంఘాలు (భీమిలి, గాజువాక, అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి, చోడవరం, మాడుగుల, అరకు, చింతపల్లి, పాడేరు)లో సంప్రదించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపికలు రేపు

అచ్యుతాపురం రూరల్: నునపర్తిలోని క్రీడా ప్రాంగణంలో జూనియర్, సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక ఆదివారం నిర్వహించనున్నట్టు శ్రీరామ బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి విశాఖ జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొంప నరసింహానాయుడు తెలిపారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు జనవరి, 2010 తర్వాత జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 29, 30, 31 తేదీల్లో ప్రకాశం జిల్లా చేబ్రోలులో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాలకు 99498 73441 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వాలీబాల్ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన జిల్లాస్థాయి వాలీబాల్ జట్టు

అనకాపల్లి: రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే వాలీబాల్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక శుక్రవారం జరిగింది. ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ విజయవాడలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తోందని, ఇందులో పాల్గొనే జిల్లా జట్లను ఎంపిక చేశామని జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ అధికారి ఎల్.వి.రమణ చెప్పారు. శుక్రవారం జరిగిన ఎంపిక పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 50 మంది బాలురు, 16 మంది బాలికలు పాల్గొన్నారని చెప్పారు. రిలో బాలుర విభాగంలో 25 మందికి ఈనెల 13 వరకు శిక్షణ ఇస్తున్నామని, వీరిలో ఎంపిక చేసిన 12 మంది బాలురు విశాఖలో ఈనెల 16 నుంచి 20 వరకు జరిగే జోనల్ పోటీలలో పాల్గొంటారని చెప్పారు. అక్కడ గెలుపొందిన జట్టు ఈనెల 21 నుంచి 25 వరకు విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. జట్లకు కోచ్ కం మేనేజర్లుగా భీశెట్టి శ్రీనివాసరావు, విల్లూరి ప్రసాద్ వ్యవహరిస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు కె.ఎస్.వి సత్యనారాయణ, సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు ఎల్లపు గోవింద, రాపేటి సీతారాం, ఆడారి హరి ప్రభాకర్, పీలా రమణారావు, బుద్ధ శివ, ఎల్లపు సత్యనారాయణ, శిలపరశెట్టి భాస్కరరావు, మోటూరి నాగేశ్వరరావు, పీఈటీలు ఎస్.వి.నరసింహం, కె.ఎం. నాయుడు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు తాటిపర్తిలో హెలిప్యాడ్ ఏర్పాటు



భద్రతా ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

మాడుగుల: పాడేరులో శనివారం ఆదివాసీ దినోత్సవంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి చంద్రబాబు కోసం మాడుగుల మండలం తాటిపర్తిలో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాట్లను ఎస్పీ తుహిన్ సిన్హా శుక్రవారం పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై అధికారులకు ఎస్పీ సూచనలు చేశారు. ఆర్డీవో వి.వి.రమణ, అదనపు ఎస్పీ ఎం.దేవిప్రసాద్, డీఎస్పీలు ఎం. శ్రావణి, పి.నాగేశ్వరరావు కె.కోటపాడు సీఐ పైడిపునాయుడు, ఎస్ఐ నారాయణరావు పాల్గొన్నారు.

మరణించి మరో ఇద్దరికి వెలుగునిచ్చి



పెందుర్తి: అనారోగ్యంతో మరణించిన ఇంటి పెద్ద నేత్రాలు దానం చేసి మానవత్వం చాటుకుంది ఓ కుటుంబం. చింతలగ్రహారం గవరపాలేనికి చెందిన కాళ్ల కన్నారావు(65) ఊపిరితిత్తులు, కిడ్నీ సంబంధిత వ్యాధులతో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఈ నేపథ్యంలో స్థానిక సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి దాడి శ్రీనివాస్ మృతుని కుటుంబ సభ్యులను సంప్రదించి, నేత్రదానంపై అవగాహన కలిగించారు. దీంతో కన్నారావు భార్య లక్ష్మి, కుమారుడు ముత్యాలనాయుడు, కుమార్తె లక్ష్మి అంగీకారం తెలిపారు. దీంతో ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి సారథ్యంలోని మొహిషిన్ ఐ బ్యాంక్ ప్రతినిధులు కన్నారావు నేత్రాలను సేకరించి సురక్షితంగా ఆస్పత్రికి తరలించారు. పుట్టెడు దుంఖంలోనూ కన్నారావు కుటుంబ సభ్యులు చూపిన మానవత్వాన్ని స్థానికులు ప్రశంసించారు.

పోలీసుల వేధింపులతోనే ఆత్మహత్యాయత్నం’



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కృష్ణమూర్తి

దాబాగార్డెన్స్: పోలీసుల వేధింపుల కారణంగానే తన కుమారుడు ఆత్మహత్యాయత్నం చేశాడని బుచ్చెయ్యపేట మండలం ఐతంపూడి గ్రామానికి చెందిన ముచ్చకర్ల మహాలక్ష్మినాయుడు ఆరోపించారు. కేజీహెచ్‌లో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న తన కుమారుడు కృష్ణమూర్తికి ఏ పాపం తెలియదన్నారు. మూడు నెలల కిందట గ్రామంలో జరిగిన దొంగతనం కేసులో పోలీసులు అన్యాయంగా ఇరికించి జైలుకు పంపించారని వాపోయాడు. బెయిల్‌పై వచ్చిన కృష్ణమూర్తి, పంచాయతీ ఎన్నికల్లో వచ్చిన తగాదాలను దృష్టిలో పెట్టుకుని తనను అన్యాయంగా ఇరికించినట్లు ముచ్చకర్ల శివతో ఫోన్లో మాట్లాడాడని చెప్పారు. గ్రామంలో మాట్లాడుకుందామని చెప్పినప్పటికీ శివ తన పలుకుబడితో పోలీసులకు ఫిర్యాదు చేశాడని, దీంతో పోలీసులు తన కుమారుడ్ని మళ్లీ స్టేషన్‌కు పిలవడంతో భయంతో ఆత్మహత్యకు యత్నించాడని సాక్షికి మహాలక్ష్మినాయుడు తెలిపారు. తమకు న్యాయం చేయాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆయన కోరారు.

క్లుప్తంగా

గాంధీజీ అడుగు జాడల్లో నడవాలి



గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సురేష్‌బాబు

అనకాపల్లి: నేటి యువత గాంధీజీ అడుగు జాడల్లో నడవాలని గ్రామ స్వరాజ్య వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్‌బాబు కోరారు. స్థానిక జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో క్విట్ ఇండియా ఉద్యమంలో పిలుపునిచ్చిన చావో-రేవో పురస్కరించుకుని మహాత్మాగాంధీ విగ్రహానికి శుక్రవారం ఆయన పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చావో-రేవో తేల్చుకుందాం అనే నినాదంతో 1942లో క్విట్ ఇండియా ఉద్యమం చేపట్టారన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ కలాం సేవా సంస్థ కన్వీనర్ ఆళ్ల ప్రవీణ్, ప్రజా రాజకీయ వేదిక సభ్యులు మల్ల చక్రవర్తి, కొవ్వాడ వాసు, న్యాయవాది అడపా సుధాకర్, నారాయణ కాలేజీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

15న చిత్రలేఖన పోటీలు

అనకాపల్లి టౌన్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు అనకాపల్లి ఆర్ట్స్ అకాడమీ కార్యదర్శి సీహెచ్‌ఎస్‌ఎస్ రామచంద్రరావు తెలిపారు. స్థానిక గౌరీ సేవా సంఘం మళ్ల జగన్నాథం కళ్యాణ మండపంలో ఆ రోజు సాయంత్రం మూడు నుంచి ఐదు గంటల వరకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనకాపల్లి రూరల్, కశింకోట మండలాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఎల్‌కేజీ నుంచి రెండో తరగతి విద్యార్థులు కమిటీ ఇచ్చిన చిత్రాలకు రంగులు వేయాలని, మూడు నుంచి ఐదో తరగతి, ఆరు నుంచి 8 వరకు, తొమ్మిది నుంచి 10వ తరగతి విద్యార్థులు నాలుగు బృందాలుగా వారికి ఇష్టమైన చిత్రా లను వేయవచ్చన్నారు. విజేతలకు అదే రోజు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ప్రముఖ చిత్ర కళాకారుడు కళారత్న అవార్డు గ్రహీత సంకర చలపతిరావును సన్మానం చేస్తామన్నారు.

సూర్యనారాయణ పోరాటాలు ఎనలేనివి



సూర్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అనకాపల్లి టౌన్: స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా నాయకుడు ఎం. సూర్యనారాయణ 11వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ చిన్న వయసులోనే ఎస్ఎఫ్ఐ నేతగా ఎదిగి, పేదల పక్షాన నిలిచి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించారన్నారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె. లోకనాథం మాట్లాడుతూ దళితులు, మైనార్టీలపై జరుగుతున్న దాడుల పట్ల అనేక ప్రజా ఉద్యమాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్. శంకర్రావు, గంటా శ్రీరామ్, గనిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 41 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,890	4,890
రెండో రకం	3,850	3,850
మూడో రకం	3,250	3,300

అనకాపల్లి సినిమాలు

రాజా	: సార్ మేడమ్ (మ్యాట్నీ, సెకండ్‌షో)
రాజా	: అతడు (ఫస్ట్ షో, మార్నింగ్ షో)
సత్యనారాయణ స్క్రీన్-1	: కింగ్‌డమ్
సత్యనారాయణ స్క్రీన్-2	: సోమేశ్వర సులోచన
పర్తిసాయి	: మహావతార్ నరసింహం
షిర్డీసాయి	: బకాసుర రెస్టారెంట్
వెంకటేశ్వర	: మాత్ర
శ్రీ సత్య	: జూనియర్
రామచంద్ర	: హరిహర వీరమల్లు

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 364 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 221 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 58 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6, బీ పాజిటివ్-19, ఓ పాజిటివ్-28, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్ (9703613706)ను సంప్రదించవచ్చు.



గోపాలపురం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ప్రైవేటు వ్యక్తుల సామగ్రి



మారేడుపూడి పంచాయతీ శివారు జగనన్న కాలనీ వద్ద ప్రభుత్వ స్థలం ఆక్రమణ

ప్రభుత్వ స్థలాల ఆక్రమణ

- కూటమి పాలకుల దందా
- చోద్యం చూస్తున్న అధికారులు

అనకాపల్లి: కూటమి నాయకులు అధికారంలోకి రాగానే ఆక్రమణలకు తెర లేపారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి అక్రమంగా భవన నిర్మాణాలు చేపడుతున్నారు. వీటిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. ప్రధానంగా పట్టణంతోపాటు గ్రామాల్లో ప్రభుత్వ భూములను ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. మరికొన్ని చోట్ల వ్యాపారాలకు అనుకూలంగా మార్చేస్తున్నారు. మండలంలో గోపాలపురం ఎలిమెంటరీ ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వ స్థలాన్ని దశలు వారీగా ప్రైవేటు వ్యక్తులు ఆక్రమిస్తున్నారు. ఇప్పటికే ఎలిమెంటరీ స్థలం సగానికి పైగా ఆక్రమణకు గురైనట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది వ్యక్తులు ఇక్కడ ప్రభుత్వ పాఠశాల ఆవరణను ఆక్రమించి టెంట్‌హౌస్ సామాన్లు వేస్తున్నారు. దాంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమించి ప్రహరీ..

మండలంలో మారేడుపూడి పంచాయతీ శివారులో జగనన్న కాలనీ సమీపంలో ఆరు సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని కూటమి నేతలు ఆక్రమించారు. అంతటితో ఆగకుండా ప్రహరీ సైతం నిర్మిస్తున్నారు. జాతీయ రహదారిని ఆనుకున్న ఈ స్థలాన్ని ఆక్రమించినప్పటికీ వీఆర్వో, రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడాలి



గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు వీఆర్వోల పర్యవేక్షణలో ఉంటాయి. ప్రభుత్వ స్థలాలు కొంతమంది ఆక్రమించి, చిన్నపాటి గృహాలు నిర్మించి అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రభుత్వ భూములను అధికారులు కాపాడకపోతే రానున్న రోజుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాం.
– కల్యాణ్ చక్రవర్తి, అనకాపల్లి

ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ధర్నా



ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలో సీపీఎం ధర్నా

అనకాపల్లి: కేంద్ర ఎన్నికల సంఘం బీహార్ తరహాలోనే దేశవ్యాప్తంగా చేపట్టాలని చూస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) వ్యతిరేకిస్తూ స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలో శుక్రవారం సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం మాట్లాడుతూ బీహార్‌లో ఓటర్ల జాబితాను ప్రత్యేకంగా సమగ్రంగా సవరించాలని (ఎస్ఐఆర్) ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ ప్రక్రియను దేశవ్యాప్తంగా విస్తరింపచేయాలని భావిస్తోందన్నారు. ఓటర్ల జాబితా నుంచి విదేశీయులను తొలగించాలనే నిరాధారమైన సాకుతో, మైనారిటీలు, ఇతర ఎంపిక చేసిన గ్రూపులకు చెందిన వారికి, వలస కార్మికులకు ఓటు హక్కు లేకుండా చేయడానికి చూస్తున్నారు. రాష్ట్రంలో దీనిని అమలు చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల కమిషన్ చేపడుతున్న ఈ ప్రజాస్వామ్య విరుద్ధమైన ప్రక్రియకు ప్రజలందరూ వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శంకరరావు, గనిశెట్టి సత్యనారాయణ, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు వాకర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ మార్కెట్ యార్డు, గుమస్తాల సంఘం కార్యాలయంలో ఈ నెల 10న ఉదయం 7 గంటలకు 2025 వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు రాపేటి నారాయణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కల్యాణి నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ కె.కె.వి.ఎ.నారాయణ రావు హాజరై 'ఆరోగ్య సమస్యలు-నివారణోపాయాలు' అనే అంశంపై అవగాహన కల్పిస్తారన్నారు. క్లబ్ సభ్యులు హాజరు కావలసిందిగా కోరారు.

క్రీడలపై యువత ఆసక్తి పెంపొందించుకోవాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి టౌన్: క్రీడలపై యువత ఆసక్తి పెంపొందించుకోవాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు కోరారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మలసాల భరత్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా మండలంలోని వేట జంగాలపాలెంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఎంపీపీ బ్యాటింగ్ చేసి ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బొడ్డు యాకూబ్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో 40 జట్లు పాల్గొన్నాయన్నారు. 27న జరిగే ఫైనల్స్‌లో విన్నర్‌కు రూ.20 వేలు, రన్నరప్‌కు రూ.10 వేలుతోపాటు షీల్డ్ అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ, యాకూబ్ యూత్ సభ్యులు డి. మోహన్, నాగు, శంకర్, శ్రీను, సూర్య, కిరణ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

రాఖీల అమ్మకాల జోరు



కశింకోటలోని ఓ దుకాణంలో రాఖీల కొనుగోలు



అనకాపల్లిలో రాఖీ దుకాణాల వద్ద సందడి

కశింకోట/అనకాపల్లి టౌన్: అన్నాచెల్లెళ్ల అనురాగానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండగ పురస్కరించుకొని మండలంలోని దుకాణాల్లో రాఖీల అమ్మకాలు జోరుగా సాగాయి. అనకాపల్లి, కశింకోట, తాళ్లపాలెం, బయ్యవరం, నరసింగబిల్లి, కన్నూరుపాలెం తదితర గ్రామాల్లో వీటిని విక్రయిస్తున్నారు. చిన్నారులు నుంచి పెద్దల వరకు వీటిని ఉత్సాహంగా కొనుగోలు చేస్తున్నారు. ఇవి వివిధ రూపాల్లో ఆకర్షణీయంగా ఉన్నాయి. కనీసం రూ.15 నుంచి రూ.200 వరకు పరిమాణం, నాణ్యత, రూపం అనుసరించి వీటిని విక్రయిస్తున్నారు. వీటిని తమ సోదరులకు రక్షణగా కట్టి తమ ప్రేమాభిమానాలు పంచుకోవాలని మహిళలు ఉత్సాహపడుతున్నారు. వీటితోపాటు మిఠాయిలు, పండ్లను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. రాఖీ కట్టడంతోపాటు మిఠాయిలు తినిపించి నోటిని తీపి చేస్తారు. పండ్లను అందజేసి తమ ప్రేమాభిమానాలను చాటుకుంటారు. సోదరులు తమ స్తోమత మేరకు కానుకలు అందజేసి సోదరి పట్ల తమ ఆత్మీయ అభిమానాన్ని చూపుతారు.



అనకాపల్లిలో షాపుల్లో అమ్మకానికి సిద్ధంగా వివిధ రకాల మిఠాయిలు

ధ్యాన వేంకటేశ్వరునికి పూజలు నేడు

కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు తెలిపారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన వేంకటేశ్వరస్వామి జన్మించిన రోజు, శ్రావణ పౌర్ణమి ఒకే సారి కలిసి రావడం చాలా విశేషమన్నారు.

వరాలతల్లికి వేవేల దండాలు

- భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రత పూజలు
- ఆలయాలు భక్తులతో కిటకిట
- నూకాంబికకు రూ.7 లక్షల నోట్లతో అలంకరణ



నూకాంబిక అమ్మవారి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు

అనకాపల్లి: శ్రీలక్ష్మీదేవీ రావమ్మా.. కోరిన కోర్కెలు తీర్చవమ్మా.. అంటూ మహిళలు వరలక్ష్మీతల్లిని కొలిశారు. సిరులు జల్లు కురిపించే కల్పవల్లి వరలక్ష్మి చల్లని ఆశీస్సులు కోరుతూ శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఊరూవాడా నిండు నూరేళ్లూ సౌభాగ్యం కోరుతూ నవ వధువులు, ముత్తయిదువులు, కన్యలు వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణ, మండలంలో దేవాలయాలు, ప్రతి గృహం అమ్మవారి పూజలతో కళకళలాడాయి. మహిళలు తమ శక్తి మేరకు లక్ష్మీదేవిని పూజించారు. వ్రత పరిసమాప్తి అయ్యాక ముత్తయిదువులను పిలిచి వాయినాలు ఇచ్చి వారి ఆశీస్సులు పొందారు. గ్రామాల్లో అమ్మవార్ల ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీవ్రతాలతో సందడి వాతావరణం ఏర్పడింది.

నూకాంబిక అమ్మవారి ఆలయంలో...

స్థానిక గవరపాలెం నూకాంబిక బాలాలయంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రావణమాసం వరలక్ష్మి వ్రతాలను నిర్వహించారు. అమ్మవారిని రూ.7 లక్షల నోట్లతో ఆలయ ఉద్యోగులు అలంకరించారు. మూడు రోజులు పాటు అమ్మవారి అలంకారాన్ని ఉంచుతున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ కె.ఎల్.సుధారాణి ఆధ్వర్యంలో అమ్మవారిని అలంకరించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఎలాంటి రుసుములు లేకుండా ఉచితంగా ఈ వ్రతాలను నిర్వహించారు, ఆలయానికి వచ్చిన భక్తులకు ఉచితంగా ప్రసాద వితరణ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఆలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సతకంపట్టు కనకదుర్గమ్మవారు...

స్థానిక గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మను వరలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జాము నుంచి అమ్మవారికి మహిళలతో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, ఆలయ చైర్మన్ భీమర వరహా నూకరాజు, ఆలయ వ్యవస్థాపకుడు పి.వి.రమణ, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



తాళ్లపాలెంలోని నూకాకంబిక ఆలయంలో భక్తుల పూజలు

కన్యకాపరమేశ్వరి...

స్థానిక మెయిన్‌రోడ్డు రహదారిలో కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శ్రావణమాసం మూడో శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారిని వరలక్ష్మీదేవి అవతారం అలంకరించారు. భక్తులు పాల్గొని సామూహిక కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మవారి ఆలయంలో...

మండలంలో సత్యనారాయణపురం కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని వరలక్ష్మీదేవిగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేసి, అమ్మవారి మండపంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం ఉచిత అన్న సమారాధన కార్యక్రమం చేపట్టారు. ఆలయ అధ్యక్షుడు యడ్ల త్రినాథ్‌రావు, చైర్మన్ కోటిపల్లి కిషోర్, ధర్మకర్త బోయిన రమణాజీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కన్యకాపరమేశ్వరి దర్శించునేందుకు క్యూ లైన్లో భక్తులు

గవరపాలెం సంతోషిమాత ఆలయం...

గవరపాలెం సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పాల్గొని ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మారిశెట్టి భాస్కరరావు, ఆలయ ఈవో మురళీ, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పలు ఆలయాల్లో..

పట్టణంలో వేల్పులవీధి కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో, నిదానందొడ్డి కామాక్షిదేవి తదితర ఆలయాల్లో శ్రావణ శుక్రవారం వేడుకలు అమ్మవారికి ఘనంగా నిర్వహించారు. ప్రధాన దేవాలయాలు వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

అనకాపల్లి టౌన్: పట్టణంలోని భోగలింగేశ్వర స్వామి ఆలయంలో సర్వకామదాంబ అమ్మవారికి వరలక్ష్మి వ్రతం సందర్భంగా గజమాలతో అలంకరణ చేశారు. కాండ్రేగుల నాయుడు, భాగ్యలక్ష్మి దంపతుల సౌజన్యంతో అర్చకులు పేరూరి చిన్ని స్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



కశింకోట శివాలయంలో సర్వమంగళాంబ అలంకరణ



గవరపాలెం సంతోషిమాత



మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి వరలక్ష్మీదేవిగా అలంకరణ



కశింకోటలోని కనకమహాలక్ష్మి ఆలయంలో కుంకుమార్చనలు



దర్శించుకుంటున్న భక్తులు

కశింకోట: శ్రావణ శుక్రవారం వరలక్ష్మీదేవి వ్రతం పురస్కరించుకొని మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు జరిగాయి. స్థానిక కనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారిని అలంకరించి కుంకుమార్చనలు చేశారు. అర్చకుడు వి. కృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయంలో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అర్చకులు వి. చిదంబరం, కృష్ణల ఆధ్వర్యంలో సర్వమంగళాంబను అందంగా నగలు, నూతన వస్త్రాలతో అలంకరించారు. పూజలు నిర్వహించారు. గవరపేటలోని శారదా గణపతి రామాలయంలో మహిళలు లలితా సహస్ర నామ పారాయణ చేశారు. లలితా దేవికి కుంకుమార్చనలు చేశారు. ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయం, లక్ష్మీనృసింహస్వామి ఆలయం, వేణుగోపాలస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఎక్కువగా దర్శించారు.



వరలక్ష్మీదేవిగా.. గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ



సత్యనారాయణపురం కనకదుర్గమ్మ

కశింకోట: తాళ్లపాలెంలోని నూకాంబిక ఆలయంలో శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతం పురస్కరించుకొని భక్తులు ఎక్కువగా దర్శించారు. గాజులతో అలంకరించిన అమ్మవారిని ఆసక్తిగా తిలకించి పూజలు చేశారు. అర్చకులు మధిర శ్రీరామ్మూర్తి, ఫణిల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

దారి దోపిడీ అంటూ వ్యక్తి ఫిర్యాదు





ఘటనా స్థలంలో విచారిస్తున్న క్రైం ఎస్ఐ సూరిబాబు, తీవ్ర గాయాలతో కేజీహెచ్‌లో శ్రీను

- మద్యం మత్తులో బైక్‌పై నుంచి పడిపోయాడని విచారణలో వెల్లడి
- తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైనం

పెందుర్తి: తాను అర్ధరాత్రి వస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తనపై దాడి చేసి నగదు దోచుకుపోయినట్లు వేపగుంట అప్పలనర్సయ్య కాలనీకి చెందిన ఓ వ్యక్తి పెందుర్తి క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తీవ్ర గాయాలతో అతడు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై ఎస్ఐ డి.సూరిబాబు ఆధ్వర్యంలో క్రైం బృందం శుక్రవారం సమగ్ర విచారణ చేపట్టారు. వివరాలివి.. కాలనీకి చెందిన బైక్ మెకానిక్ దయ్యాల శ్రీను (35) గురువారం అర్ధరాత్రి బయటికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఆ సమయంలో నాయుడుతోట సంతోషిమాత ఆలయం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు తనపై దాడి చేసి బైక్, సెల్‌ఫోన్, జేబులో నగదు ఎత్తుకుపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తిరిగి బైక్, సెల్‌ఫోన్ ఇచ్చేశారని పోలీసుల విచారణ చెబుతున్నాడు. దీనిపై శుక్రవారం పోలీసులు సమగ్ర విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారుడు శ్రీను మద్యం మత్తులో బైక్‌పై నుంచి పడిపోయినట్లు ప్రాథమికంగా గుర్తించారు. తన వద్ద దుండగులు దోచుకుపోయిన నగదు తన యజమాని ఇచ్చినట్లు చెబుతున్నాడు. అయితే పోలీసుల విచారణలో అతడికి నగదు ఇవ్వలేదని యజమాని చెప్పారు. ఈ క్రమంలో దోపిడీ జరిగిందా లేదా అన్న అంశంపై లోతుగా విచారిస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

అధిక లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్‌పై ఆగ్రహం

మునగపాక: పూడిమడక రోడ్డులో అధిక లోడుతో వెళ్తున్న వాహన డ్రైవర్‌పై శుక్రవారం సాయంత్రం మునగపాకలో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ వాహనాల వల్ల సంభవిస్తున్న రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు కొంత కాలం క్రితం స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించిన విషయం తెలిసిందే. దీంతో రాత్రి 10 గంటల తర్వాత నుంచి తెల్లవారు లోగా వాహనాలు రాకపోకలు సాగించేందుకు అంగీకరించారు. ఇదేమీ పట్టనట్లు అధిక లోడుతో రాయిని తరలిస్తున్న లారీని స్థానికులు అడ్డుకున్నారు. ఈ మార్గంలో రాత్రి సమయంలో మాత్రమే రాకపోకలు సాగించేలా అధికారులు చొరవ చూపుతుంటే, అధిక లోడుతో ఎలా వస్తారంటూ స్థానికులు డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కొంతసేపు ట్రాఫిక్ నిలిచింది. పోలీసులు డ్రైవర్‌ను మందలించారు.